దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమిలో గ్రాడ్యుయేషన్ పెరేడ్‌లో ఆకట్టుకున్న వాయు ప్రదర్శనలు

హైదరాబాద్ వార్త

గ్రూప్2 పరీక్షలకు సర్వం సిద్ధం

-నేడు, రేపు రెండు రోజులపాటు నిర్వహణ
-జిల్లాలో 101 పరీక్ష కేంద్రాల.. 48,011 మంది అభ్యర్థులు
-టిజిపిఎస్సీ సూచనలు అభ్యర్థులు తప్పక పాటించాలి
-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: జిల్లాలో టీజీపీఎస్సీ గ్రూప్2 పరీక్షలకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్2 నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 480 11 అభ్యర్థుల కోసం 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిలో కావాల్సిన సౌకర్యాలు అధికారులు సమకూర్చామన్నారు. పరీక్షలు సాఫీగా పగడ్బందీగా జరిగేలా 5గురు రీజినల్ కోఆర్డినేటర్స్, 15 మంది జాయింట్ రూట్ ఆఫీసర్స్, టీజీపీఎస్సీ ద్వారా 101 మంది అబ్జర్వర్లు, 3 పరీక్ష కేంద్రాలకు ఒకరు1చొప్పున 33 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్,101 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను,458 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను, ప్రతి పరీక్ష కేంద్రానికి 3 సీసీ టీవీ కెమెరాలను(చీఫ్ సూపర్డెంట్, మెయిన్ ఎంట్రెన్స్ గేట్ , ఎగ్జామినేషన్ హాల్) వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి పరీక్ష కేంద్రాము లోకి అనుమతించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ తీసుకుని రావాలి. ఒకే హాల్ టికెట్ ను పరీక్ష మొత్తం వినియోగించాలి. హాల్ టికెట్‌లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్‌కు అప్పగించాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్, పెన్ డ్రైవ్, బ్లూ టూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రి తీసుకుని రావడానికి వీల్లేదు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షూస్ వేసుకోవద్దు. సెల్‌ఫోన్,బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్ళరాదు. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదు. బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ, టాటూ వంటివి పెట్టుకోవద్దు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్ పై సంతకం పెట్టాలి. మోడల్ ఓ.ఎం.ఆర్ షీట్ల ను వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలి. ఓఎంఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదు.

13 గంటలకు పైగా జైలులోనే పుష్ప

-చంచల్‌గూడ జైలు వద్ద అభిమానుల కోలహలం
-జైలులో పుష్ప..పుష్ప అరిచినట్లు సమాచారం
-పుష్ప అరెస్టుతో అభిమాని ఆత్మహత్య యత్నం

సైదాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త: నాంపల్లి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు వచ్చిన అల్లు అర్జున్‌కు జైలు నిబంధనల ప్రకారం అడ్మిషన్ ప్రాసెస్ పూర్తి చేసి యుటి నంబరు 7697ను కేటాయించారు. పేరుతో పాటు ఇతర వివరాలు, కోర్టు రిమాండ్ వివరాలను జైలు రికార్డులలో నమోదు చేసుకున్నారు. అడ్మిషన్ ప్రాసెస్ పూర్తి చేసేలోగానే హైకోర్టు బెయిల్‌ను మంజూరు చేసినట్లు సమాచారం రావడంతో తాను ఏ క్షణమైనా విడుదల కావచ్చన్న భరోసాతో ఉన్న అల్లు అర్జున్ జైలులో ఛాయ్, బిస్కట్లు కూడా తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే బెయిలు పేపర్లు సకాలంలో అందక పోవడంతో నిబంధనల ప్రకారం ఆయనను మంజీర బ్యారక్‌కు పంపించారు. మంజీర బ్యారక్‌లో అల్లు అర్జున్‌తో పాటు మరో ఇద్దరు విచారణలో ఉన్న ఖైదీలు ఉన్నట్లు సమాచారం. రిసెప్షన్ నుంచి అల్లు అర్జున్‌ను బ్యారక్‌కు తరలిస్తున్నప్పుడు జైలులో బ్యారక్‌లలో ఉన్న ఖైదీలు పుష్ప..పుష్ప అని అరిచినట్లుగా సమాచారం. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో జైలుకు వచ్చిన అల్లు అర్జున్‌ను శనివారం ఉదయం 6.40 నిమిషాలకు విడుదల చేశారు. అంటే 13 గంటలకు పైగానే ఆయన జైలులో ఉండాల్సి వచ్చింది. జైలు నుంచి విడుదలైన సమయంలో అప్పటికే అక్కడకు చేరుకున్న అల్లు అర్జున్‌తో కలిసి మెయిన్ గేటు నుంచి కాకుండా మరో గేటు నుంచి ఆయన కారులో బయటకు వెళ్లిపోయారు.

భోజనం తిరస్కరణ..అర్ధరాత్రి దాటిన మెలకువతోనే..

బ్యారక్‌కు పంపించిన అనంతరం అల్లు అర్జున్‌కు భోజనం పెట్టినప్పటికీ ఆయన తిననట్లుగా తెలుస్తుంది. ఊహించని విధంగా అరెస్టు కావడమేగా కుండా ఏకంగా జైలుకు రావడం..బెయిలు వచ్చినప్పటికీ విడుదల కాకపోవడంతో ఒకింత ఆందోళనకు ఆయన గురయినట్లుగా సమాచారం. రాత్రి దాదాపు 2 గంటల వరకు ఆయన మెలకువతోనే ఉన్నట్లుగా తెలుస్తుంది. ఆ తర్వాత సాధారణ ఖైదీలలాగే ఆయన నేలమీద పడుకుట్లుగా తెలుస్తుంది.

అభిమాని ఆత్మహత్యా యత్నం..

సినీ నటుడు అల్లు అర్జున్‌ను చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. జై అల్లు అర్జున్..అల్లు అర్జున్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. బెయిలు వచ్చినప్పటికీ అల్లు అర్జున్ విడుదల కాకపోవడంతో కొంత మంది అభిమానులు జైలు వద్దే తెల్లవార్లు ఉన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత బాలాపూర్‌కు చెందిన రాజు అనే అభిమాని వంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అతనిపై నీళ్లు పోసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

-ఆరోగ్యకరమైన ఆహారం అందించేందుకు మెస్, కాస్మాటిక్ ఛార్జీల పెంపు
-షేక్‌పేట్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్
-విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీ గురుకులాలు, వసతి గృహాల్లో చదివే 8 లక్షల మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా 40శాతండైట్ చార్జీలు,200 కాస్మెటిక్ పెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుందని జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు శనివారం షేక్ పేట సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ బాయ్స్ కళాశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టితో కలసి మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో కామన్ డైట్ మెనూ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు 11వందల కోట్లతో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్మాణాలు, మరమ్మత్తులకు మరమ్మత్తులు చేపట్టామని అన్నారు. ముఖ్యంగా గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు బలమైన ఆహారం అందించాలని నిపుణులైన డాక్టర్ల సమక్షంలో డైట్ మెనూ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గత పాలకుల వలన 10 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయిందని విద్యావ్యవస్థను గాడిలో పెట్టి ఎన్నో విప్లవత్మక మార్పులకు తాము శ్రీకారం చుట్టామన్నారు. అదేవిదంగా ఉపాధ్యాయులకు ప్రమోషన్ లు, కొత్తగా ఉపాధ్యాయ నియమకాలు చేపట్టి అధ్యాపక వర్గ అసహనాన్ని తొలగించామని అన్నారు. గతంలో కిరాయిల ఇవ్వలేదని గురుకుల అద్దె భవనాలు ఖాళీ చేసే పరిస్థితి ఉంటే తమ ప్రభుత్వం అద్దె బిల్లులు చెల్లించడంతోపాటు మెస్ ఛార్జీలు గ్రీన్ ఛానెల్ ద్వారా చెల్లించడం జరుగుతుందని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ నవ రత్నాలు స్థాపించి టెక్నికల్ గా దేశం ఎక్కడికో ఎదిగిందని ఈ సందర్భంగా గుర్తుచేసారు. 20 మంది జూడో క్రీడాకారులకు జూడో డ్రెస్‌లు కలెక్టర్ ఆధ్వర్యంలో అందిచడం జరుగుతుందని తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వస్తుందని, అక్కడ కూడా పెద్ద ఎత్తున సీట్లు సంపాదించాలని విద్యార్థులకు సూచించారు.హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, సంక్షేమ హాస్టల్ లలో వసతులు మెరుగు పడేలా ప్రతి సంవత్సరం 470 కోట్లు రూపాయల అదనపు భారం పడుతున్నప్పటికీ డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిందన్నారు. వసతి గృహాల్లో సానిటేషన్, వెంటిలేషన్, హైజానిక్, రుచికరమైన ఆహారం అందించుటకు ఇది తొలి అడుగు అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు మంచి చదువు, ఆహారం అందిస్తుందని అన్నారు. విద్యయే ప్రగతికి తొలిమెట్టు, చదువుకు మించిన ఆస్తి లేదు దాన్ని మించిన గౌరవం లేదని ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్,విద్యార్థులతో కలిసి మంత్రి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, ఆర్డిఓ సాయిరామ్, ఇంచార్జ్ డిడి సోషల్ వెల్ఫేర్ కోటాజీ,ప్రిన్సిపాల్ బాల స్వామి తదరులు పాల్గొన్నారు.

తెలంగాణ అంటేనే సకల కళల ఖజానా...

చిన్నారుల సకల కళాప్రదర్శనల్లో ఒక దృశ్యం

రవీంద్రభారతి, డిసెంబరు 14 ప్రభాతవార్త : తెలంగాణ అంటేనే సకల కళల ఖజానా.... భూగోళంగా, శీతోష్ణస్థితి, సహజ సౌదర్యం, సాంస్కృతిక వైవిధ్యపరంగా ఎంతో విశిష్టత కనబడుతుందని, తెలంగాణ సర్వజన సంస్కృతికి ప్రతిబింబమే భారత్ ఆర్ట్స్ అకాడమీ ఈరోజు నిర్వహించిన సకల కళా వైభవం అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. వేలాది సంవత్సరాల నుండి తెలంగాణ ఒకవైపు జానపదం ప్రాణపదం మన జ్ఞానపదమని, జానపద గిరిజన కళారూపాలుంటే మరోవైపు శాస్త్రీయ, సాంస్కృతిక సంప్రదాయాలకు నెలవు, కొలువు అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారి ఆత్మీయ జాతీయ సంసద శాస్త్రీయ కూచిపూడి నృత్యమన్నారు. భారతీయ సంస్కృతిలోని ఔనత్యానికి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకురావడంలో కీలపాత్ర పోషిస్తున్న సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబిసి ఫౌండేషన్ల వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ కె.వి.రమణారావు, లయన్ లలితరావులని కొనియాడారు. లెక్కకుమిక్కిలిగా ప్రపంచ రికార్డులు కైవసం చేసుకున్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుండి రాత్రి వరకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లయన్ లలిత రమణారావు నిర్వహణలో రమణీయం, కమనీయం, నయనమనోహరంగా జరిగిన సకల కళావైభవంకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. మామిడి హరికృష్ణ విశిష్ట అతిథులు కోలేటి దామోదర్‌గుప్తా, డా. బి.సత్యవరప్రసాద్, నాగేశ్వరరావు, ఎస్ఎస్. రాజు తదితరులతో కలిసి ఈనాటి సకల కళా వైభవంలో వివిధ ప్రదర్శనలిచ్చిన చిన్నారి కళాకారిణి మనోజ్ఞ తదితర కళాకారులు సంగీత నాట్యగురువులు 33మందిని ఘనంగా సత్కరించి, ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేసి శుభాశీస్సులందజేసి ప్రసంగించారు. ఉదయం నుండి రాత్రి వరకు సకల కళా వైభవంలో కళాకారుల వివిధ ప్రదర్శనలు ఆహుతులను అబ్బురపరిచి, అలరించి మంత్రముగ్ధులను చేశాయి.

నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త : జలమండలి పరిధి రెడ్ హిల్స్ రిజర్వాయర్‌కు ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్స్ నుంచి నీటి సరఫరా 33 ఇంచుల పైప్‌లైన్ ధ్వంసమైన కారణంగా జలమండలి అత్యవసర మరమ్మతులు పనులు చేపడుతున్నది. ఈ నేపథ్యంలో ఈనెల 15వ తేది ఆదివారం రిజర్వాయర్ పరిధిలో పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. రెడ్ హిల్స్ బజార్ ఘాట్, మల్లేపల్లి, సీతారాంబాగ్, నాంపల్లి రైల్వేస్టేషన్, నిలోఫర్ ఆసుపత్రి, ఎంఎన్‌జె కేన్సర్ ఆస్పత్రి, యూసుఫైన్ ఢార్గా ఏరియా, ఏక్ మినార్, సుభాన్, గన్‌ఫౌండ్రీలోని కొంత భాగం, ఆదర్శ్ నగర్, బిజెఆర్ నగర్, 2బిహెచ్‌కె, ఖైరతాబాద్, మింట్ కాంపౌండ్, పాత సిబిఐ క్యూటిఆర్ఎస్ ఏసి గార్డులు, ఇన్ కమ్ ట్యాక్స్ క్యూటిఆర్‌లో కొంత భాగం, విజయ్ నగర్ కాలనీలో కొంత భాగం సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈ నేపత్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

జీవో నెంబర్ 317 సవరించాలి
- స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలి

ధర్నాలో నినాదాలు చేస్తున్న జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నేతలు

ధర్నాచౌక్, డిసెంబర్ 14, ప్రభాతవార్త: జీవో నెంబర్ 317ను సవరించి, స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఛైర్మన్ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జీవో నెంబర్ 317 వల్ల కోల్పోయిన స్థానికతను తిరిగి సాధించటానికై ఛలో హైదరాబాద్ పేరుతో మహానిరసన దీక్ష చేపట్టారు. ఈ ధర్నానుద్దేసించి వారు మాట్లాడుతూ జీవో 317ను సవరించటం వల్ల ప్రభుత్వంపై ఎటువంటి ఆర్థిక భారం పడదని, అదేమీ పరిష్కరించలేని పెద్ద సమస్య కూడా కానప్పటికీ ప్రభుత్వం జీవోను సవరించకపోవటం బాధాకరమని అన్నారు. స్థానికత పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో స్థానికతకు విరుద్ధంగా ఉన్న జీవో 317ను వెంటనే సవరించాలని, జీవో వల్ల నష్టపోయిన ఉద్యోగ ఉపాధ్యాయులందరినీ వారి వారి జిల్లాలు, జోన్‌లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం కమిటీ నియమించినప్పటికీ ఆ కమిటీ ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వకుండా తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఉపసంఘం కేవలం మూడు జీవోలను విడుదల చేసి, స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ బాధితులకు మాత్రమే ఊరట కలిగించిందని అన్నారు. వాస్తవానికి మంత్రి వర్గ ఉపసంఘం 317 జీవో వల్ల స్థానికత కోల్పోయిన బాధితులకు న్యాయం చేయటం కోసం ఏర్పాటుచేయబడిందని, కానీ స్థానికత అంశం లేకుండా మంత్రివర్గ ఉపసంఘం మూడు జీవోలను విడుదల చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో 317ను సవరించాలని, మంత్రి వర్గ ఉపసంఘంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చర్చలు జరపడానికి ప్రభుత్వం ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. రానున్న శీతాకాల అసెంబ్లీ సమావేశాలలో 317 జీవో బాధితుల సమస్యలపై చర్చించి, తీర్మానం చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి సందీప్, కోశాధికారి వినోద, నేతలు వెంకటేష్, ప్రవీణ్, పోచన్న, కృష్ణప్రసాద్, భరద్వాజ్, సమియుద్దీన్, బాల ప్రసాద్‌లతో పాటు బాధిత ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని, స్థానికత మా జన్మహక్కు అంటూ నినదించారు.

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

-ఆరోగ్యంగా ఉండండి, సురక్షితంగా ఉండండి,కష్టపడి చదువుకోండి
-భరోసా ఇచ్చిన సిపి

బాగ్‌లింగంపల్లి బాలికల మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన నగర పోలీసు కమిషనర్ సివి.ఆనంద్

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనసాగించడంతో పాటు,క్రీడలలో పాఠ్యేతర కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడానికి ప్రోత్సహించాలని నగర పోలీస్ కమీషనర్ సి వి ఆనంద్ కోరారు. తెలంగాణ ప్రభుత్వము గురుకులాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, రాజకీయ నాయకులు వసతి గృహాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు ఆదేశించారు. ఇందులో భాగంగా శనివారం బాగ్‌లింగంపల్లి శ్రీరామ్‌నగర్‌లోని తెలంగాణ అల్పసంఖ్యాకుల గురుకుల పాఠశాల(తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న విద్యార్థులతో వారి సమస్యలు ,వారికి ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిసున్న అల్పాహారం ఇతర అంశాలను సాంఘిక సంక్షేమ ఉపసంచాలకులు డాక్టర్ కె.చల్లాదేవి, ప్రిన్సిపాల్ కె.వాణిశ్రీ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఏ విధమైన డైట్ ఇస్తున్న అంశాలను తెలుసుకున్నారు. పాఠశాలల్లోని కిచెన్, వాష్ రూమ్, సైన్స్ ల్యాబ్ కంప్యూటర్ ల్యాబ్ ,రోబోటిక్ ల్యాబ్, స్పోర్ట్స్ రూమ్, డార్మిటరీలు పోలీస్ కమిషనర్ ప్రత్యక్షంగా సందర్శించారు. స్కూల్ విద్యార్థులకు బోధిస్తున్న విధానము గురించి అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో ఉన్న అన్ని అంతస్తులు క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సివి ఆనంద్ విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతిరోజూ ఆరోగ్యకరమైన ఆహార విధానాన్ని తీసుకోవాలని మరియు క్రీడల వంటి పాఠ్యేతర కార్యకలాపాలలో పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు, ఇది ఆరోగ్యకరమైన వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఇది జీవితంలో రాబోయే సవాళ్లను ఎదుర్కోవడంలో, విభిన్న వ్యక్తుల ఆలోచనలతో వ్యవహరించడంలో సహాయపడుతుందన్నారు. ఈ సంస్థలోని విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం వారికి అందిస్తున్న సౌకర్యాలు, వస్తువులు మెచ్చుకో తగ్గవిగా ఉన్నవి అని తెలిపారు. అన్ని సాంఘిక, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మరింత మంచి పోషకమైనదిగా చేయడానికి రూ.500 కోట్ల రూపాయల బడ్జెట్‌తో అభివృద్ధి చేయడం విశేషమన్నారు. గురుకుల పాఠశాల్లో ఉన్న వారంతా విద్యలో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థులను అభినందించారు. ఇది కేవలం ఆ సంస్థలోని ఉపాధ్యాయుల వల్లనే సాధ్యమైందన్నారు. ఈ సంస్థల విద్యార్థులు కూడా సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం ప్రయత్నించాలి."ఆరోగ్యంగా ఉండండి, సురక్షితంగా ఉండండి, కష్టపడి చదువు కోండి, మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కోరి కలను నెరవేర్చండి, వారి ఆశలపై నిలబడండి." అని సివి.ఆనంద్ కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి సబ్ డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య జీవితం నేటి తరం దళిత జాతికి స్ఫూర్తి కావాలి

సైఫాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త: దళితులపై జరిగిన అన్యాయాలను, అక్రమాలను ఎదరించి న్యాయం చేయడంలో పోరాట యోధుడు, అంబేద్కరిస్టు, దళిత నేత డా.కె.నాగయ్య జీవితం నేటి తరం దళిత జాతికి స్ఫూర్తి కావాలని పలువురు నాయకులు కొనియాడారు. చుండూరు, కారంచెడు, నీరుకొండ తోపాటు ఆనేక ఉద్యమాల్లో పాల్గొన్న నాగయ్య ప్రభుత్వాలను, అన్యాయాలను అక్రమాలను ఎదిరించారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. శనివారం నాడిక్కడ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో జరిగిన డా.కె.నాగయ్య 10వ వర్ధంతి ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కాడారం వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత నేతలు ఎస్.ఎల్లన , పి.వి.రత్నం, బాపనపల్లి ప్రమోద్‌కుమార్, దాసరి ప్రభు తదితరులు ప్రసంగించారు. నాగయ్య ఆనేక మంది ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కోసం పోరాడారని, నిరుద్యోగులకు బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం ఉద్యమించారని, దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా సహించేవారు కాదని, ఆ యన గొప్ప మానవతావాది అని వారు ప్రసంశించారు. అంతకు ముందు వారు నాగయ్య చిత్రపటానికి పూల మాలవేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమషాలు మౌనం పాటించారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాకలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త: అంబర్‌పేట నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తున్నదని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నానని పేర్కొన్నారు. శనివారం గోల్నాక డివిజన్ పరిధిలోని తులసి రామ్ నగర్ (లంకలో) 29 లక్షల అంచన వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు అధికారులతో కలిసి స్థానిక బస్తీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలోని లంకను ఆదర్శప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని అదేవిధంగా కాలనీవాసులు స్ట్రీట్ లైట్లు సమస్య, రోడ్లకి ఇరువైపుల చెట్లు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన సొంత నిధులతో పూర్తి చేయిస్తానని బస్తి వాసులకి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్ గౌడ్, సురేష్ గౌడ్, దేవేందర్, లింగం గౌడ్, బుచ్చిరెడ్డి, సంతోష్, ఉమా దేవి,తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రతినిధులు

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రతినిధులు

చార్మినార్,డిసెంబరు 14 ప్రభాతవార్త : రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మను శనివారం హైదరాబాద్ పాతబస్తీకి చెందిన సెంట్రల్ ఫీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రధాన కార్యదర్శి శ్రీ కిషన్ శర్మ,సెంట్రల్ జోన్ అధ్యక్షులు శశికాంత్ అగర్వాల్ ఆధ్వర్యంలో పలువురు పీస్ కమిటి ప్రతి నిధులు కలిశారు. హైదరాబాద్ నగరంలో గత ముప్పై సంవత్సరాలు నుంచి శాంతి భద్రతల పరిరక్షణ కోసం శాంతి కమిటి పోలీసుల తో కలిసి సేవలు అందిస్తున్నదని, పీస్ అండ్ వెల్ఫేర్ కమిటి చేస్తున్న ప్రజా ప్రయోజనాలు గురించి వారు రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫీస్ అండ్ వెల్ఫేర్ కమిటి ప్రధాన కార్యదర్శి శ్రీ కిషన్ శర్మ,సెంట్రల్ జోన్ అధ్యక్షులు శశికాంత్ అగర్వాల్,సౌత్ వెస్ట్ జోన్ అధ్యక్షులు మహ్మద్ మోజ్మా అలీ,వెస్ జోన్ అధ్యక్షులు తేజో విజయ్ కుమార్,ఈస్ట్ జోన్ కమిటి అధ్యక్షులు నారాయణ రెడ్డి,సౌత్ జోన్ ప్రెసిడెంట్ ఖాజా మొయిజ్,నార్త్ జోన్ ప్రెసిడెంట్ ఆర్.ఉమేంద్ర కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడి పూజ

అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,డిసెంబరు 14 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాలలో శనివారం శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాలో అయ్యప్ప స్వామి భక్తులు నిర్వహించిన 18వ మహా పడి పూజ కార్యక్రమంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరి మీద ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. బిజెపి నాయకులు,కార్యకర్తలు,అయ్యప్ప స్వామి భక్తులు పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గురు దత్త జయంతి

పూజలు చేసిన కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 14ప్రభాతవార్త: గురు దత్త జయంతిన్ని పురస్కరించుకుని చారిత్రాకమైన చిన్నబజార్‌లోని నర్సింహ్మ స్వామి దేవాలయంలో పురానాపూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ ప్రత్యేక పూజలు చేశారు.ఈసందర్భంగా ఆలయ కమిటి నిర్వాహకులు సున్నం రాజ్‌మోహన్‌ను శాలువ కప్పి సన్మానించారు.ఈకార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్,కె.మల్లేష్, ఎస్‌వి నగర్ అధ్యక్షులు ఎంపి సదానంద్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలి : సిఐ శ్రీనివాస్

హైదరాబాద్, డిసెంబరు 14, ప్రభాతవార్త: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కాచిగూడ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలకు హెల్మెట్ లేకపో వడమే ఇందుకు కారణమని ఆయన స్పష్టం చేశారు. శనివారం బర్కత్‌పుర చౌరస్తా వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన పలువురు వాహనదారులకు సిబ్బంది తో కలిసి అవగాహన కల్పించారు. హెల్మె ట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, హెల్మెట్ ధరించారు. అనంతరం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ..హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపటం వల్ల అనేక మంది ప్రమాదాల బారిన పడుతున్నారని, మరికొందరు చనిపోతున్నారని అన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లా డుతూ వాహనం నడపరాదన్నారు. ద్విచక్ర వాహ నంపై ముగ్గురు వెళ్లరాదని, ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద, సిగ్నల్స్‌ల వద్ద నిబంధనలను అతిక్రమించరాదని తెలిపారు. మితిమీరిన వేగంతో వాహనం నడిపేవారిపై చట్టపరంగా జరిమానాలు విధించనున్నట్లు హెచ్చరించారు. సీటుబెల్టు ధరించి కారు నడపాలని సూచించారు. ఇప్పటి వరకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నప్పుడు తలపై హెల్మెట్ ఉన్నా లేకున్నా చూసి చూడనట్టుగా వ్యవహరించిన పోలీసులు ఇకపై కఠినంగా వ్యవ హరిస్తారని పేర్కొన్నారు. అలాగే తనిఖీల సమయంలో హెల్మెట్ ధరించకుండా పట్టు బడిన ప్రతి వాహనదారుడికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్య క్రమంలో ట్రాఫిక్ ఏ ఎస్ఐ అనిల్‌గౌడ్, ట్రాఫిక్ సిబ్బంది నారాయణరెడ్డి, సుబ్బా రెడ్డి, నగేష్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్, చత్రంలో ఎఎస్ఐ అనిల్‌గౌడ్ తదితరులు

తెలుగు కనిపించి,వినిపించి, పలికించాలి : సుద్దాల అశోక్‌తేజ

బహుమతులు పొందిన విజేతలతో అశోక్‌తేజ, దైవజ్ఞశర్మ, మాధవరావు, మస్తాన్, అంకయ్య తదితర అతిథులు

నాంపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త : తెలుగు భాష ఎన్ని నదులుగా, రూపాలుగా, సముద్రాలుగా విస్తరించిందో చెప్పలేమని, తెలుగు కనిపించాలి, వినిపించాలి, పలికించాలి అని ఇది తెలుగే అని అనిపించాలన్నదే తాపత్రయమని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. బొగ్గులకుంట, తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన మన సంస్కృతి సంస్థ తెలుగు, హిందీ ప్రతిభా పరీక్షల పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అశోక్‌తేజ పాల్గొని ప్రసంగించారు. తమిళులకు తమిళభాషపై ఉన్నంత ప్రేమ తెలుగువాళ్లకు తెలుగుభాషపై లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని భాషలు నేర్చుకోకూడదని ఆంక్షలేవీ లేవని, అలాగని తెలుగు మాత్రమే నేర్చుకోవాలని కూడా లేదన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా తప్పులేదు గానీ మాతృభాష తెలుగును మరువరాదని స్పష్టం చేశారు. మనది తెలుగుజాతి అని, తెలుగుభాష చిరంజీవితా ఉండిపోవాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి వచ్చిన తెలుగు, హిందీ ప్రతిభభా పరీక్షల విజేతలకు ఆయన నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి వారిని ఎంతగానో అభినందించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, ప్రొఫెసర్ సివిఎల్.మాధవరావు, రూప్ కుమార్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్ డా. షేక్‌మస్తాన్, సీనియర్ పాత్రికేయుడు అన్నమాచారి, డా. పైడి అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన, చెరువుల సంరక్షణకు మేధావుల మద్దతు

-హక్కు ఇనిషియేటివ్ డైరెక్టర్ కోట నీలిమ వెల్లడి

హైదరాబాద్,డిసెంబరు 14,ప్రభాతవార్త: మూసిని ప్రక్షాళన, చెరువులను సంరక్షించాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మేధావుల నుంచి , పౌర సమాజం నుంచి మద్దతు లభించిందని హక్కు ఇనిషియేటివ్ డైరెక్టర్ కోట నీలిమ చెప్పారు.అయితే సంబంధిత భాగస్వాములందరి నుంచి, ముఖ్యంగా స్థానికంగా నివసించే ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని, వాటి ఆధారంగా ప్రభుత్వం విధానాలు రూపొందించాలని, నిర్ణయాలు తీసుకోవాలని వారు వెల్లడించినట్టు తెలిపారు. ఈమేరకు శనివారం హైదరాబాదులోని ఫిలింనగర్ కల్చరల్ సెంటర్లో డెమోలిషన్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై హక్కుఇనిషియేటివ్ సమాలోచనల కార్యక్రమం నిర్వహించింది. ఇందులో సామాజిక కార్యకర్తలు, న్యాయవాదులు, ప్రొఫెసర్లు పర్యావరణవేత్తలు సహా వివిధ రంగాల రంగాల ప్రముఖులు పాల్గొని విలువైన సూచనలు చేశారు. ఈసూచనల ఆధారంగా హక్కు ఇనిషియేటివ్ మూసి ప్రక్షాళన, చెరువుల సంరక్షణపై తీర్మానాలను రూపొందించింది. త్వరలోనే ఈ తీర్మానాలను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు హక్కు ఇనిషియేటివ్ డైరెక్టర్ కోట నీలిమ వెల్లడించారు. ప్రజాభాగస్వామ్యంతోనే నిర్ణయాలు తీసుకోవాలన్నది, విధానాలు రూపొందించాలన్నది తెలంగాణలోని ప్రస్తుత ప్రభుత్వ విధానమని కోట నీలిమ స్పష్టం చేశారు. అందుకే హక్కు ఇనిషియేటివ్ ప్రజా సమాలోచనల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఇటువంటి సమాలోచనల కార్యక్రమాల ద్వారా సమస్యలకు చక్కటి పరిష్కారాలను హక్కు ఇనిషియేటివ్ సాధించిందన్నారు. ముందు ముందు ఇటువంటి సమాలోచనలు కార్యక్రమాలను మరిన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. శనివారం నాటి సమాలోచనల కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ పద్మజ షా, కొడాలి శ్రీనివాస్, దుర్గాప్రసాద్, అశోక్ భాషిన్, పంకజ్ అగర్వాల్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ లుబ్నా సార్వత్, డాక్టర్ అనంత్ మరిగంటి, రుబీనా నఫీస్, సుజాత సూరేపల్లి, డాక్టర్ ప్రభు కుమార్,సయ్యద్ బిలాల్ , హక్కు ఇనిషియేటివ్ డైరెక్టర్లు రాహుల్ హెమ్నాని, అనూజ్ పార్థీ, సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ కు చెందిన నందనం కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోట నీలిమ, లుబ్నా సార్వత్ తదితరులు

ఉద్యోగులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడి చేయడం హేయమైన చర్యగా తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకరాల చంద్రశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొన్న లాగచర్ల ఘటన మరువక ముందే నిన్న అబ్దుల్లాపూర్మెట్ మండలం జాఫర్ గూడ చెరువు బఫర్ జోన్ లో ఓ మెడికల్ కాలేజీ యజమాని అక్రమ నిర్మాణం చేపట్టిందని ఇరిగేషన్, ఏ ఈ ఈ వంశిధర్,రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ కట్టడానికి తొలగించారని ఈ సందర్భంగా కాలేజీకి చెందిన బౌన్సర్లు ఇరిగేషన్ ఏఈఈ వంశిధర్, రెవిన్యూ అధికారులపై దాడి చేయడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటివి ఇలాగే కొనసాగితే విధులు చేయడం కూడా కష్టతరంగా ఉంటుందన్నారు. ఇలాంటి చర్యలను పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఉద్యోగ సంఘాలన్నీ ఏకధాటిగా ఈ సంఘటనను ఖండించాలని అవసరమైతే పెండౌన్ చేసి నిరసన తెలుపాలని కోరారు. దీనిపై ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించనున్నట్లు చంద్రశేఖర్ గౌడ్ పేర్కొన్నారు.

కళాత్మకంగా రాష్ట్రస్థాయి పద్యనాటక ప్రదర్శనలు

నాంపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్యల సౌజన్యంతో శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో 9రోజుల పాటు జరుగుతున్న తెలంగాణ రాష్ట్రస్థాయి పద్యనాటక పోటీల నవరాత్రుల్లో 3వరోజు శనివారం పాలమూరు కళావిపంచి, కూకట్‌పల్లి వారిచే పల్లెటి లక్ష్మీ కులశేఖర్ రచన, గుంపుల సుదర్శన్ దర్శకత్వంలో రూపొందిన మన్యంకొండ హనుమద్దాసు పద్యనాటక ప్రదర్శన; నర్సాపూర్ మెదక్‌కు చెందిన నాట్యగురువు కవిత, జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన నాట్యగురువు శ్రీవాణి ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యప్రదర్శనలు; భగవద్గీత సత్యంగ్ చింతల్ పద్మానగర్ వారి భగవద్గీతా పారాయణము అద్భుతంగా ప్రదర్శింపబడ్డాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు బాపనపల్లి పరమేశ్వర్, ఎండి పి.హరిప్రసాద్, సలహాదారు శివ నారాయణ, వేముల లోకేష్, ఏటూరి హరినాథ్ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సైఫాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త: విద్యార్థులు ఉన్నత చదువులతో అన్ని రంగాలలో రాణించి దేశానికి, రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఉస్మానియా యూనివర్సిటి డీన్, మేనేజ్‌మెంట్ అండ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి,శ్రీరాములు చెప్పారు. బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో శనివారం జరిగిన అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజస్ స్నాతకోత్సవం-2024లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ స్నాతకోత్సవాన్ని అవంతి గ్రూప్ ఆఫ్ కాలేజస్ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు పరిస్థితులకు అనుగుణంగా పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. టెక్ మహేంద్రా వైస్-ప్రెసిడెంట్ మల్లాడి నాగార్జున మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడిస్ ఛైర్మన్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ, కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపల్ అప్పారావు, డా.అజ్‌మల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులకు అతిథులు డిగ్రీస్ అందజేశారు.

పరేడ్‌మైదానం గేట్ నెం8 వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బేగంపేట డిశంబరు 14,ప్రభాతవార్త

సికింద్రాబాద్ పరేడ్‌మైదానం గేట్ నెంబర్ 8వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.ఈ సంఘటనపై విధులలో ఉన్న పెట్రోకారు 2 పోలీసు ఏ.శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.బేగంపేట పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఈ నెల 13వ తేదీన బేగంపేట పోలీస్‌స్టేషన్ లో పెట్రోకారు 2లో కానిస్టేబుల్ ఏ.శ్రీకాంత్,హోంగార్డు ఈ.సురేష్ లు విధులు నిర్వర్తిస్తున్నారు.ఉదయం గం 7.30నిల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి వయసు 45నుంచి 50సంవత్సరాలు ఉంటుంది.అతని ఒంటిపైన డార్క్ బ్లూకలర్ చొక్కా, గ్రేఫ్యాంట్,ధరించి ఉన్నాడని,మృతి చెందిన వ్యక్తిని పరిశీలిస్తే హిందువుగా ఉన్నాడని,సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ గేట్ నెంబరు 8వద్ద పడి ఉన్నాడని,వెంటనే 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారన్నారు.అతన్ని పరిక్షించగా మృతి చెందాడన్నారు.వెంటనే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించామన్నారు.మృతుని ఆచూకి తెల్సిన వారు బేగంపేట పోలీసు స్టేషన్ లో గానీ డయల్ 100కు గానీ సమాచారం ఇవ్వాలని ఎస్సై జె.నాగరాజు తెలియజేసారు.

రాష్ట్ర మంత్రి వర్గంలో మైనార్టీలకు అవకాశం కల్పించాలి

సైఫాబాద్, డిసెంబరు 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో 14 శాతం ఉన్న మైనార్టిలకు మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం అన్యాయమని తహ్రీక్ ముస్లిం షాబ్బాన్ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తాక్ మాలిక్ ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మైనార్టిలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి అత్యధికంగా ఓట్లు వేయడం జరిగిందని కాని మంత్రి వర్గంలో అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికైన మంత్రి వర్గ పునర్ వ్యవస్థికరణలో మైనార్టిలకు ప్రాధాన్యత కల్పించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో మైనార్టిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ళ పాలనలో రాష్ట్రంలో మత ఘర్షణలు జరగలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రాష్ట్రంలో ఆనేక చోట్ల మత ఘర్షణలు జరిగాయని, మత ఘర్షలను అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వంపైన ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలు చేసుకున్నది, కాని మైనార్టిలకు చేసింది ఏమిలేదన్నారు. విద్యా, ఉద్యోగ, ఆర్థిక, అభివృద్ధి రంగాలలో, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో చేసింది ఏమిలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మైనార్టిలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అక్బర్ అక్తర్‌ఆలీ, గఫర్, ఖలీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మహమ్మద్ ముస్తాక్ మాలిక్

నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న యువతీ యువకులు

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: నిరుద్యోగ యువత యువతీయువకులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల డైరెక్టర్ విష్ణుప్రియ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యా సంస్థల ఆవరణలో విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పించుంటుకు కళాశాలల మానేజ్మెంట్ ఆధ్వర్యంలో ప్లేసెమెంట్ డ్రైవ్ నివాహించారు. మార్కెట్ అనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచుకోవాలని అత్యంత ఆదరణ కలిగిన కార్పొరేట్ కంపెనీలాయనా అమెజాన్, కాగనిజాంట్ ఒరాకీల్ మరియు క్రాంప్ టన్ గేమ్స్ , మ్యాజిక్ బస్ జరిగిన ప్లేసెమెంటు మెగా ఈ వెంట్స్ లో పాల్గొన విద్యార్థులలో అన్ని రౌండ్స్ కంప్లీట్ చేసి సుమారు 60 మంది విద్యార్థులు షార్టలిస్ట్ చేశారు. ఈ సందర్భంగా విష్ణు ప్రియా మాట్లాడుతూ షార్టలిస్ట్ అయినా విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను విద్యార్థులకు నిర్వహించడానికి సహాయ సహకారాలు అందజేసి వారికీ మంచి భవిష్యత్ బాటలు వేస్తూ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్, ప్రిన్సిపాల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్టాఫ్, వివిధ కంపెనీలా ఆఫీసర్స్ విద్యార్థులు పాల్గొని విజయవంతంగా ముగించారు.

గాంధీనగర్ డివిజన్‌లో ప్రజల వద్దకే కార్పొరేటర్

ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, డిసెంబరు 14 ప్రభాతవార్త: ప్రజల వద్దకే కార్పొరేటర్ కార్యక్రమంలో బాగంగా గాంధీ నగర్ డివిజన్‌లోని బాపు నగర్ బస్తీ వాసులతో శనివారం స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ పర్యటించారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ తో కలిసి బస్తీలో పర్యటించారు. కలుషిత మంచి నీటి సరఫరా, లో ప్రెషర్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇటీవల స్థానిక కార్పొరేటర్ చొరవతో స్థానికంగా చాలా ఎళ్ళుగా ఉన్న సీవరేజ్ పైప్ లైన్ తో సమస్య పరిష్కారం అయిందని.అందుకు ప్రత్యేక దృష్టి వహించి పనులు పూర్తి చేయించిన కార్పొరేటర్‌కు కృతజ్ఞత తెలిపారు. బాపునగర్ లో సీవరేజ్ పనుల అనంతరం ఏర్పాటు చేసిన షాబాద్ బండల నిర్మాణంలో పలు చోట్ల రిపేర్లు వున్నాయని, కరెంట్ తీగల క్రమబద్ధీకరణ లో బంచ్ కేబుల్ ఏర్పాటు ప్రక్రియలో కొద్దిబాగం మిగిలివుందని, త్వరలో అన్ని పనులను పూర్తి చేసి, కలుషిత మంచి నీటి సరఫరా, లో ప్రేషర్ సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ బీజేపీ నేతలు దామోదర్, బస్తి వాసులు శ్రీను,హరీష్, నాగరాజు,శోభ, వసంత,కోటేశ్వరీ, బేబీ,విజయలక

అర్హులకు సిఎం రిలీఫ్ ఫండ్ అందిస్తాం: ఎమ్మెల్యే



ఎల్ఓసి అందిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, డిసెంబరు 14 ప్రభాతవార్త: అర్హులైన అందరికి సీఎం రిలీఫ్ పండ్ నిధులు అందే విధంగా ప్రయత్నం చేస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అనారోగ్య సమస్యలతో బాద పడుతున్న వెంకటాపురం డివిజన్‌కు చెందిన మహేశ్వరికి 1లక్ష రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన ఎల్ఎసిని ఎమ్మెల్యే అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేత అనీల్ కిషోర్ ఇతరులు పాల్గొన్నారు.

కన్నుల పండగలా రథోత్సవం

అల్వాల్, డిసెంబరు 14 ప్రభాతవార్త: అల్వాల్ చారిత్రాత్మకమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలులో బాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి రథం పుర వీధులలో సంచరించింది. వందల సంఖ్యలో భక్తులు ప్రజలు రథోత్సవంలో పాలు పంచుకున్నారు. రథం కదులుతుండగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. రథోత్సవం రాత్రి 11 గంటలు వరకు సాగింది.

గంగపుత్రులు ప్రభుత్వ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలి : రఘు

సమావేశమైన గంగపుత్ర సంఘం సభ్యులు

సికింద్రాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్తః గంగపుత్రుల ఎదుగుదలకు వారాసిగూడ, బౌద్ధనగర్ గంగపుత్ర సంఘం తరపున విశేష కృషి జరుపుతున్నామని తెలంగాణ గంగపుత్ర సంఘం, వారాసిగూడ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ దేశబోయిన రఘు తెలిపారు. వారాసిగూడ గంగపుత్ర సంగం సమీపంలో గత మూడు రోజులుగా గంగపుత్రులకు నేషనల్ ఫిషరీస్ డిజిటల్ ప్లాట్ ఫామ్ ప్రొవిజనల్ సర్టిఫికేట్ కార్డులు, ఈశ్రమ్ కార్డ్ మినిస్టరీ ఆఫ్ లేబర్ ఆండ్ ఎంప్లాయిమెంట్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కార్డ్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక ప్రయోజనకర పథకాలను అందజేస్తున్నాయని, వాటిని గంగపుత్రులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అనేక విధాలుగా వెనుకబడిన గంగపుత్రులు అన్నిరంగాలలో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం గంగపుత్ర సంఘం తరపున తగిన ప్రోత్సాహాన్ని అందించడానికి సఘం సిద్దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సఘం నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి : తలసాని

అధికారులతో పాటు ఖబరస్తాను పరిశీలిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, డిసెంబర్ 14 ప్రభాతవార్తః అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బన్సీలాల్‌పేటన డివిజన్‌లోని జీవైఆర్ కాంపౌండ్ పక్కనే గల ఖబరస్తాన్‌ను వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి అంతిమ గడియలు ముగిసేది ఇక్కడేనని, ఇక్కడకు వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అవసరమైన అన్ని అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు పలు సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల నిమిత్తం ఇక్కడకు వస్తారని వివరించారు. సీసీరోడ్లు, టాయిలెట్‌ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, వివిధ శాఖల అధికారులు సుదర్శన్, వినోద్, ఆశిష్, జావిద్, అన్వర్, శాబుద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలో మజ్దూర్ యూనియన్‌కు గుర్తింపు సర్టిఫికెట్ ప్రధానం

రైల్వే మజ్దూర్ యూనియన్‌కు గుర్తింపు సర్టిఫికెట్ అందజేస్తున్న రైల్వే జిఎం.ఏ.కె.జైన్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 14 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియ్ గుర్తింపు ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు ఎస్.సి. ఆర్.జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మజ్దూర్ యూనియన్ నేత డాక్టర్ సి.హెచ్.శంకర్ రావ్,అధ్యక్షులు శ్రీనివాస్‌లకు గుర్తింపు సర్టిఫికెట్‌ను అందజేశారు. రైల్వేలో 6 సంవత్సరాల పాటు ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఉంటుంది. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఫీఫ్ పర్సనల్ ఆఫీసర్ జి.ఆర్.ఎస్. రావ్, డిప్యూటీ సిపిఓ బాలమురళీధర్, మజ్దూర్ యూనియన్ జోనల్ కోశాధికారి సరోజిని రెడ్డి, ఏజిఎస్‌లు ఉదయ్ భాస్కర్, డివిజనల్ కార్యదర్శి రవిందర్, రాంమోహన్ ముదిరాజ్, నాగలక్ష్మి, సి.సి. ఎస్. చైర్మన్ చిలుక స్వామి, నర్సింహా రెడ్డి, యుగంధర్ యాదవ్, వినేయ్, సమ్మయ్య, రాజేందర్, శ్రీనివాస్, సంజీవయ్య,బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : కొంతం దీపిక

మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

కంటోన్మెంట్,డిసెంబర్ 14 ప్రభాతవార్త: మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. దత్త జయంతిని పురస్కరించుకొని శనివారం వెస్ట్ మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు ఈఓ అరుణ కుమారి, ప్రధాన అర్చకులు రాజేశ్వర శర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లిలో ప్రజాపాలన విజయోత్సవ ముగింపు వేడుకలు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 14, ప్రభాతవార్త

ప్రజాపాలన విజయోత్సవ ముగింపు వేడుకలు శనివారం మూసాపేటలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ క్రమశిక్షణను ఎవరు ఉల్లంఘించినా, అవినీతికి పాల్పడినా వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. అందరూ నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కూకట్పల్లిలో స్థానిక నాయకత్వం బలంగా ఉందని అందరూ సహకరించాలన్నారు. అనంతరం కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను కచ్చితంగా అమలు చేసి తీరుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేసిన రైతు రుణమాఫీతో పాటు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియచెప్పడంలో కొంత వెనుకబడ్డామని, ఇకనుంచి అలా జరగదని ప్రతి కార్యక్రమాన్ని ప్రతిగడపకు తీసుకెళ్తామన్నారు. నియోజకవర్గంలో 4,500 ఇందిరమ్మ ఇళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వీటిని త్వరలోనే కేటాయిస్తామన్నారు. రానున్న కార్పొరేషన్ పంచాయతీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధించబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు సత్యం శ్రీరంగం, మాజీ అధ్యక్షులు సేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏఎంసీ చైర్మన్ పుష్ప రెడ్డి, మైనారిటీ నాయకులు యూత్ నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగింపు వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ప్రభుత్వ పాఠశాలల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

3వ వార్డు బాలంరాయిలో పవర్‌బోర్ వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 14 ప్రభాతవార్త: కంటోన్మెంట్‌లోని వివిధ ప్రభుత్వపాఠశాలల్లో మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. శనివారం 3వ వార్డు బాలంరాయిలోని ప్రభుత్వపాఠశాలలో రూ.6లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పవర్‌బోర్ వెల్ పనులను కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా విద్యార్థులకు బెంచీలు,టీచర్లకు ఫర్నీచర్లు, ఇతర సామాగ్రిని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ అరుణకుమారి, నాగరత్న, లీలాబాయి, దేవిక, కాంగ్రెస్ నాయకులు రాజేశ్, దర్గారవి, సాయిరెడ్డి, వెంకట్, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : లింగాని ప్రసన్న

అడ్డగుట్ట,డిసెంబర్ 14 ప్రభాతవార్త: మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ కంటోన్మెంట్ సికింద్రాబాద్, కిమ్స్ ఫౌండేషన్ రెసెర్చ్ సెంటర్, జనహిత సేవా ట్రస్ట్, శివశక్తి ఫౌండేషన్, భరత్ వికాస్ పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అడ్డగుట్టలోని అజాద్ చంద్రశేఖర్ నగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,పెండెం మనోహర్, సత్తయ్య గౌడ్, దాసరి, నరేశ్,రాజు, మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ బి.నర్సింగ్‌రావ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో పయనింపజేసేదే అయ్యప్ప మండల దీక్ష : రాజేశ్వరరావు

అయ్యప్ప స్వాములతో వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 14, ప్రభాతవార్త

జ్యోతి స్వరూపుడు.. హరిహరసుతుడు అయినా అయ్యప్ప స్వామి మాలలో శరీరాన్ని, మనస్సును అదుపులో ఉంచుకొని సన్మార్గంలో పయనింపజేసేదే అయ్యప్ప మండల దీక్ష అని, 41 రోజుల పాటు అయ్యప్పకు ఆత్మనివేదన చేసుకుంటూ నిత్యశరణు ఘోషతో పూజిస్తారని వడ్డేపల్లి రాజేశ్వర రావు అన్నారు. శనివారం వివేకానంద నగర్ అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణం నందు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి కరకమలములచే అయ్యప్ప స్వామి మాల ధరించిన స్వాములకు ఆల్పాహారం ప్రసాదించారు. దాతలు చెన్నయ్య, సురేందర్ రెడ్డి గురుస్వాముల మంచి స్వదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషకరమని వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి వారిని అభినందించారు. వారికి అయ్యప్ప స్వామి అష్టఆయురారోగ్యాలను ప్రసాదించి ఎల్లవేళల స్వామి వారి దీవెనలు ఉండాలని ఆశీర్వదించారు.

స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు

గాయత్రినగర్‌లోని మెగా స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 14, ప్రభాతవార్త : విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని మెగా స్కూల్ కరస్పాండెంట్ రఘువీర్‌నాథ్ రావు అన్నారు. శనివారం పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు వారి వారి ప్రతిభను కనబరుస్తూ 10రకాల నమూనాలను ప్రదర్శనలో ఉంచారు.కాళేశ్వరం ప్రాజెక్ట్, చార్‌మినార్, తాజ్‌మహల్, మెట్రోరైల్, హైటెక్‌సిటీ, విమానాశ్రయం, గ్రామ వాతావరణం, అసెంబ్లీ, సెక్రటరీయేట్, తదితర అంశాలను ప్రదర్శనలో ఉంచారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సుచిత్ర పాటిల్, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గీత చదవటంతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కలుగుతుంది

భగవద్గీత జయంతి ఉత్సవాలు

నిజాంపేట్, డిసెంబర్ 14, ప్రభాతవార్త

నిజాంపేటలో సంస్కృత ప్రచార సమితి, విజ్ఞాన్ విద్యాలయం వారి ఆధ్వర్యంలో శనివారం భగవద్గీత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ బ్రాంచ్ ల విద్యార్థులకు శ్లోక పఠనము, భాగవత పద్య పఠనము, వక్తృత్వము, క్విజ్, కీర్తనల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ప్రచార సమితి అధ్యక్షుల పరవస్తు అనంత శేషావతారం ముఖ్య అతిథిగా విశ్వహిందూ పరిషత్, తెలంగాణ, శేరిలింగంపల్లి నగర సంఘచాలకులు మాధవరెడ్డి గారి గాలిరెడ్డి, విశిష్టాతిథిగా దరూరి రామానుజాచార్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీత చదవటం ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని, అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు త్యాగరాజ స్వామి కీర్తనలు మధురంగా ఆలపించారు. వివిధ పోటీలలో గెలిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ వివిధ బ్రాంచ్ ల ప్రిన్సిపల్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ బాల, బాలికల జట్టు ఎంపిక

నిజాంపేట్, డిసెంబర్ 14, ప్రభాతవార్త

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ బాల, బాలికల జట్టు ఎంపిక జరగనుంది. శనివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముదిరాజ్ సూచన మేరకు కాసాని కబడ్డీ అకాడమీ బాచుపల్లి నందు జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి చంద్రహాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు సంబంధిత 10వ తరగతి మెమో, ఒరిజినల్ ఆధార్ కార్డుతో మధ్యాహ్నం మూడు గంటలకు కాసాని కబడ్డీ అకాడమీకి చేరుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9908205333/7396749998 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ బాలికల వసతి గృహంను సందర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఎస్సీ బాలికల వసతి గృహంలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, డిసెంబర్ 14, ప్రభాతవార్త: భోలక్‌పూర్‌లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సందర్శించారు. ఇటీవల వసతి గృహాలలో కలుషిత ఆహారం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయిన సందర్భంలో ఆదివారం భోలక్‌పూర్ వసతి గృహాన్ని సందర్శించి, అక్కడ వసతి, భోజనాలపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికంఠ ఆశ్రమంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం

మణికంఠ ఆశ్రమంలో స్వాములకు అన్నదానం చేస్తున్న మంచ్ అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్

అప్జల్‌గంజ్,డిసెంబర్ 14ప్రభాతవార్త: స్వామివివేకనందనగర్ కనక దుర్గమ్మ ఆలయంలోని మణికంఠ ఆశ్రమంలోఅయ్యప్పస్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.మణికంఠ ఆశ్రమంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహాత్మా జ్యోతిరావు పూలే యువ మంచ్ అధ్యక్షులు కె.ఎం.గురుచరణ్,ఉపాధ్యక్షులు పి.మహేందర్‌లు స్వాములకు సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం నుంచి శబరిమలై వేళ్లే అయ్యప్పస్వాములకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైల్ సబ్సిడి ఇవ్వాలనిడిమాండ్ చేశారు.అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రం తరుపున శబరి మలైలోని పంబా,స్వామి సన్నిదానంలోప్రత్యేక అధికారులను నియమించాలన్నారు.తెలంగాణ నుంచి వేళ్లే స్వాములకు జనవరి 1 తేది నుంచి జనవరి 20వ తేది వరకు ఎలాంటి ఇబ్బందులకు కలుగుకుండా సహాయ సహకారాలను అందించాలని ముఖ్యమంత్రి ఎనుములరేవంత్‌రెడ్డి ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో గురుస్వాములు యాదగిరి, ప్రవీణ్‌కుమార్,జయపాల్ స్వాములు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టోర్ మెటీరియల్ ఆన్‌లైన్‌లో పొందుపరచాలి

-తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: తెలంగాణ వ్యాప్తంగా ఉన్న స్టోర్ మెటీరియల్‌ను ఆన్లైన్లో పొందుపరచాలని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం ఎర్రగడ్డలోని సుందర్ నగర్ కమిటీ హాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి సి రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. దీనికి వివిధ జిల్లాల నుంచి కాంట్రాక్టర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈసందర్భంగా జిసిరెడ్డి మాట్లాడుతూ టీజీఎస్పీడీసీఎల్ లో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యల పైన అదేవిధంగా వెండర్ పైన తెలంగాణ వ్యాప్తంగా స్టోర్ లో ఉన్నటువంటి మెటీరియల్ పైన సంకుచితంగా చర్చించినట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న స్టోర్లలో ఒక మెటీరియల్ ఉంటే ఇంకొక మెటీరియల్ లేకపోవడం ఇంకో మెటీరియల్ ఉంటే ఇంకొక మెటీరియల్ లేకపోవడం అక్కడక్కడ కాంట్రాక్టులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికి వచ్చిన కొత్త ప్రభుత్వమైన ప్రవేట్ సెంటర్లో పనిచేస్తున్న కాంట్రాక్టర్ల పైన ప్రత్యేక దృష్టి సాధించి మాకు స్టోర్లలో సరైన సమయానికి మెటీరియల్ అందే విధంగా చూడాలన్నారు. అలాగే టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి ఇటీవల ప్రవేట్ సెంటర్లో పని చేస్తున్నటువంటి కాంట్రాక్టర్ అందరూ వెండర్ కోడ్ తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారని వెండర్ కోడ్ తీసుకోవడం వల్ల ప్రైవేట్ సెక్టార్ లో పనిచేసే కాంట్రాక్టర్లకు ఉపయోగం లేదని కానీ సీఎండీ గారు ఉత్తర్వులు వచ్చిన తర్వాత వెండర్ కోడ్ తీసుకుంటామని ముక్తకంఠంతో తీర్మానం చేశారు. అదేవిధంగా ప్రవేట్ సెక్టార్ లో పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు స్పెషలైజేషన్ ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గత మూడు నెలల నుండి ఎల్సీలు లేక చాలా ఇబ్బందులకు గురవయ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి మాట్లాడుతూ ప్రవేట్ సెక్టార్ లో గాని, గవర్నమెంట్ సెక్టర్‌లోగానీ. ఏరంగంలో పనిచేసిన కాంట్రాక్టర్ అనే వ్యక్తి తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ ద్వారా లైసెన్స్ పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఆలూరు మహేందర్, ప్రధాన కార్యదర్శి నామిని వెంకటేష్ నేత, వెంకట్ రెడ్డి. అశోక్, వేణుబాబు. జి చక్రధర్ రావు, వి. చిన్న పుల్లారావు. రవీందర్ గౌడ్. కనుకాచారి. బాల్ రెడ్డి, సురేష్, రామకృష్ణారెడ్డి, ఈశ్వరరావు, శ్రీకాంత్, ధనంజయ తదితరులు పాల్గొన్నారు

సమావేశంలో అభివాదం చేస్తున్న జిసిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నక్కాయాదగిరి, వెంకటేష్ తదితరులు

నేర్చుకోవడం అనేది మొదటి అడుగు

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 14, ప్రభాతవార్త : ప్రతి ఒక్కరు నేర్చుకోవడం అనేది మొదటి అడుగుగా భావించి నేర్చుకోవడానికి ఎల్లప్పుడు అవకాశం కల్పించుకుకోవాలని మార్కుల గురించి కాకుండా నేర్చుకోవడానికి ఇష్టపడాలని సైబరాబాద్ డిసిపి సాయిశ్రీ అన్నారు. శనివారం వెంగళరావు నగర్‌లోని నలందా విద్యాసంస్థల్లో చైర్మన్ మంతెన శ్రీనువాసరాజు ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమి హైదారాబాద్ సహకారంతో 6వ తరగతి నుండి 12వరకు విద్యార్థుల కోసం ప్రత్యేకమైన సివిల్స్ ప్రోగామ్‌ను ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథులుగా సైబరాబాద్ డిసిపి సాయిశ్రీ, లా ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ రాంబాబు పాలడుగులు పాల్గొన్నారు. ఈ సంచలనాత్మక కార్యక్రమం యువకులను సమాజంలో ఉన్నతంగా తీర్చి దిద్దేందుకు రూపొందించబడింది. అవగాహన విమర్శనాత్మక ఆలోచనలు, పౌరసేవలు, ఇతర వృత్తి మార్గాలలో రానించడానికి అవసరమైన నైపుణ్యాలు సంపూర్ణ స్టీమ్స్ పాఠ్యాంశాల ద్వారా(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం, సమాజం మరియు క్రీడలు) తదితర వాటిపై ప్రాముఖ్యతను కలిగించడం జరుగుతుంది.

ఎక్సలెన్స్ ఐఏఎస్ అకాడమీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సైబరాబాద్ డీసిపి సాయిశ్రీ

ఈసందర్భంగా డిసిపి సాయిశ్రీ మాట్లాడుతూ నేటి విద్యార్థులకు వృత్తి అవకాశాలను అన్వేశించడానికి ప్రోత్సహించడతో పాటు నైతికమైన జ్ఞానంతో కూడిన భవిష్యత్తు నాయకులను తయారు చేయడంపై విద్యాసంస్థలు దృష్టి నిలపాలన్నారు. లాఎక్సలెన్స్ వ్యవస్థాపకులు డాక్టర్ రాంబాబు పాలగుడు మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. నలందా విద్యా సంస్థల చైర్మన్ మంతెన శ్రీనువాసరాజు మాట్లాడుతూ 6వతరగతి నుండి 2వరకు విద్యార్థులకు ప్రత్యేకమైన సివిల్స్ ప్రోగ్రాం నలంద విద్యాసంస్థల్లో ప్రారంభించడం తమకెంతో గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నలందా విద్యా సంస్థల డైరెక్టర్ మంతెన సూర్యనారాయణ కాశ్యప్ వర్మ, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంబాడీలకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలి

హైదరాబాద్, డిసెంబరు 14,ప్రభాతవార్త: లంబాడీలకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని గిరిజనలపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రామచంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం రాంచందర్ నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని వెలుగు గుట్ట అమ్మవారి దేవాలయంలో నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర కమిటీ ప్రతినిధులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏకపక్షంగా మా

ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ

శ్రీపురం కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ

మలక్ పేటడిసెంబరు 14, ప్రభాతవార్త: ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడం కృషి చేస్తున్నామని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని శ్రీపురం కాలనీలో ఆమె పర్యటించి శానిటేషన్ సిబ్బంది పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో స్విపింగ్ సమస్యలు, పేరుకుపోయిన చెత్త, చెట్ల కొమ్మలు ,బురద వల్ల పేరుకుపోయిన మట్టి, ఫుట్ పాత్ లపై ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని జి హెచ్ ఎం సి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వీధి దీపాల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏ నర్సింగ్, కాలనీ వాసులు దత్త, కొండారెడ్డి, సురేష్, పరశురాం, రామకృష్ణ , సందీప్, సంతోష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం

అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమా నిర్వహిస్తున్న శోభన్ గురుస్వామి, పొల్కం శ్రీనివాస్ గురు స్వామి తదితరులు

మలక్ పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త: మలక్ పేట మున్సిపల్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం సముదాయంలో కలవెండి శోభన్ గురుస్వామి ఆధ్వర్యంలో 30వ మహా పడిపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమాలను శ్రీ శ్రీ గిరిధర్ గురుస్వామి, వేమూరి కోటేశ్వరరావు గురుస్వామి పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, భజనలతో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పోల్కం శ్రీనివాస్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి : లచ్చి రెడ్డి

సి.సి.రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి.

వనస్థలిపురం. డిసెంబరు14.ప్రభాతవార్త. బి యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహర పురం కాలనీలో 46.50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యత పరిమాణాలతో పనులను నిర్వహించాలని 46.50 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మూడు సిసి రోడ్లలో రెండు రోడ్లు పూర్తయ్యాయని మరో రోడ్డు పనుల చర్యలు త్వరలోనే చేపడతామని మరియు కాలనీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని,కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షులు శంకరయ్య గౌడ్, రాములు, సత్యనారాయణ, మరియు పార్టీ నాయకులు ముత్యాలు, వర్క్ ఇన్స్పెక్టర్ సంజీవరెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు

విశ్వేశ్వరయ్య బెస్ట్ ఇంజనీర్ అవార్డ్‌కు ఎంపికైన చైతన్య

మన్సూరాబాద్ డిసెంబరు14,ప్రభాతవార్త : బహుజన సాహిత్య ఆకాడమి ఆధ్వర్యంలో శనివారం న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎల్బీ నగర్ మన్సూరాబాద్ కు చెందిన తోడేటి చైతన్య విశ్వేశ్వరయ్య బెస్ట్ ఇంజనీర్ నేషనల్ అవార్డు అందుకోనున్నారు. గత కొన్నేళ్లుగా స్పానెక్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో రూరల్ వాటర్ సప్లై , మరియు ఈరిగేషన్ ప్రాజెక్ట్స్ లలో సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు బహుజన సాహిత్య అకాడమీ (బి ఎస్ ఏ) గుర్తించి చైతన్య కు అవార్డ్ ను అందజేయనున్నారు. అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధా కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఈ అవార్డు స్వీకరించనున్నారు. ఈ అవార్డు కు ఎంపిక చేసినందుకు బి ఎస్ ఏ ప్రతినిధులకు చైతన్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు ఇంకా ఎంతో బాధ్యత ను పెంచిందని ఆయన తెలిపారు.

నిరుపేద హిందూ కుటుంబాలకు తోపుడు బండ్లు పంపిణీ

తోపుడు బండ్లు అందుకున్న వారితో సత్యం, శేఖర్జీ, శశిధర్ తదితరులు

హుడా కాంప్లెక్, డిసెంబరు 14 , ప్రభాతవార్త: జనహిత సేవా సమితి , విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరుపేదలైన హిందూ కుటుంబాలకు స్వంతంగా వీధి వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాన్ని పోశించుకునేందుకు వీలుగా ఉండాలనే సదుద్దేశ్యంతో తోపుడు బండ్లు, వేయింగ్ మెషిన్లను అందజేసారు. సరూర్ నగర్ హుడా కాంప్లెక్స్ లో జరిగిన ఈ కార్యక్రమమలో. దాదాపు పది హిందూ కుటుంబాలకు తోపుడు బండ్లు , వేయింగ్ మెషిన్ లు అందజేసినారు . ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీ సత్యం, ఎక్కా చంద్ర శేజర్జీ సేవా భారతి క్షేత్ర సంఘటనా మంత్రి , విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావి నూతల శశిధర్, ఉదయ్ కర్కరే జనహిత సేవా సమితి అధ్యక్షులు , భిక్షపతి ప్రాజెక్ట్ సెక్రటరీ లు ముఖ్య అతిథులుగా విచ్చేశారు . బీజేపీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు ఆరుట్ల సురేశ్ కుమార్ ,జిల్లా అధికార ప్రతినిధి బెంగర బోయిన సురేశ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి కోఆర్డినేటర్ మహేష్ , హుడా కాంప్లెక్స్ షా అసోసియేశన్ అధ్యక్షులు అనూప్ రాజా, బజరంగ్ దళ్ సభ్యులు పులిమద్ది సుధాకర్, బాలరాజ్ , రాంకుమార్ , కిషోర్ స్థానికులు పాల్గొన్నారు .

వివాదాల పరిష్కారానికి కమ్యూనిటీ మీడియటర్స్: పంచాక్షరి

మలక్ పేట, డిసెంబరు 14, ప్రభాతవార్త: వివాదాల పరిష్కారానికి కమ్యూనిటీ మీడియేటర్స్ ఎంతో దోహదపడుతాయని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రటరీ పంచాక్షరి పేర్కొన్నారు. మూసారంబాగ్ శ్రీపురం కాలనీ రజక భవనంలో న్యాయ సేవాధికార సంస్థ, రజక అభివృద్ధి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ కమ్యూనిటీ మీడియేటర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పంచాక్షరి తో పాటు సిటీ స్మాల్ కాజెస్ కోర్ట్ చీఫ్ జడ్జి, నగర లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ నందికొండ నర్సింగరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వివాదాలకు న్యాయస్థానాలను ఆశ్రయించకుండా కమ్యూనిటీ మీడియేటర్స్ తో సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అత్యున్నత, ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలుకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సామాజిక వర్గాల్లో సభ్యులను ఎంపిక చేసి ఇరూపక్షాలతో చర్చించి సమస్య లను తెలుసుకుని త్వరగా

న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరిని సన్మానిస్తున్న రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ చైర్మన్ నరసింహ తదితరులు

పరిష్కరించవచ్చని వివరించారు. అంతకుముందు రజక అభివృద్ధి సంస్థ గ్రేటర్ అధ్యక్షుడు నరసింహ అతిథులకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రధాన కార్యదర్శి జూపల్లి రాజశేఖర్, జ్యోతి ,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూలు, కళాశాలల్లో సదుపాయలు పెంచాలి: కార్పొరేటర్

హయత్‌నగర్, డిసెంబరు 14 ప్రభాతవార్త: ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూళ్లల్లో డైట్, కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచడం అభినందనీయమని, మరిన్ని మౌళిక సదుపాయాలను కల్పించి విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకోవాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ వసంత్‌నగర్‌లోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మెనుచార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం దాదాపు ఎనిమిదేళ్ల తరువాత డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచిందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు గురుకుల పాఠశాలల్లో ఎక్కువగా చదువుతారని వారికి నాణ్యమైన భోజనం అందించడంతో పాటు క్రమశిక్షనతో కూడిన విద్యను అందించాలని సూచించారు. తద్వారా వారిని

మెనుఛార్ట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

ఉన్నత స్థానాలకు చేర్చవచ్చన్నారు. ఈసందర్భంగా విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో చీఫ్‌ప్లానింగ్, స్పెషల్ డైట్ ఆఫీసర్ సౌమ్య, హయత్‌నగర్ తహశీల్దార్ జానకి, అడల్ట్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, ప్రిన్సిపల్ దేవిరెడ్డి జ్యోతి పాల్గొన్నారు.

ఉప్పల్ భగాయత్ సమస్యలపై పోరాటం : మధుసూధన్‌రెడ్డి

హైదరాబాద్ , డిసెంబరు 14 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం శనివారం భగాయత్‌లోని రాయల్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు వక్కంటి శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, సంగమేశ్వర్‌రెడ్డి, మేకల వెంకట్రామ్‌రెడ్డి, బంగ్లా శ్రీనివాస్‌రెడ్డి, డి.శ్రీహరి, నరేంద్ర చౌదరి, ఆర్.సుభాన్‌రెడ్డి, బి.రవీందర్‌రెడ్డి, ఎస్. వెంకటయ్య, ఎన్.మధు, జి.సాయికుమార్, టి.గోపాల్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, ప్రసాద్, శివచంద్రబాబు, కె.మహేందర్‌రెడ్డి, సన్నీజాన్సన్, జి.సంతోష్‌రెడ్డి, సమ్మద్ వర్మ, అరవింద్, ఎం.వెంకటేశ్వర్లు, సి.సుధాకర్‌రెడ్డి, సూర్య గోపాల్, మనోహర్‌రెడ్డి, నాయని మధు, రాజేందర్, వంశీధర్‌రెడ్డి, సుచిత్, సూర్య, వంశీ, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్‌లో నెలకొన్న సమస్యలపై అధికారుల దృష్టికి తీసు

ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న కన్వీనర్ మేకల మధుసూధన్‌రెడ్డి తదితరులు

కుని వచ్చి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి నెల మొదటి ఆదివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. లేఅవుట్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో జెండా వందనం కార్యక్రమం చేపట్టాలని, సమస్యలపై చర్చించి తగు కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శనం : ఎమ్మెల్యే బండారి

క్రిస్మస్ కేకును కటచేస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, శాంతి సాయిజన్ శేఖర్

నాచారం, డిసెంబర్ 14 ప్రభాతవార్త: క్రీస్తు సందేశం లోకానికి మార్గదర్శనం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం లోని పాస్టర్లు సామ్ సన్స్వామి, లాజరస్ రవికాంత్ తదితరులు నాచారం డివిజన్లోని 28 చర్చిల పాస్టర్లు ఇతరులు కలిసి వైజయంతి టాకీస్ పక్కన ఖాళీ స్థలంలో ఏర్పాటుచేసిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. దేవిడ్ రాజ్ సింగర్, పాడిన పాటలను అలాగే సునీల్ గొంగల్లా మరియు అక్సలా ఆటపాటలను వీక్షించారు. సంబరాల్లో భాగంగా యువకులు, మహిళలు చేసిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " ప్రతి మానవుడిలో ప్రేమ ,క్షమగుణం పెంపొందాలి అనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణ నియం అని ఆయన చెప్పారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణమయుడని అన్నారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయి జెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్, మేకల ముత్యంరెడ్డి, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, మారయ్య, పాస్టర్లు ప్రవీణ్ జోసఫ్, నాగయ్య, బరణీ భాను ప్రసాద్,మహేష్, ఏలియా పాల్, అభిషేక్,ఆశాజ్యోతి, సైమన్ పీటర్, నెహెమ్యా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్ళలో విద్యార్థుల డైట్, కాస్మాటిక్ ఛార్జీల పెంపు హర్షణీయం: మేయర్ పారిజాత

హైదరాబాద్ డిసెంబరు 14 ప్రభాతవార్త: హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచడం హర్షణీయమని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ళల్లో డైట్, కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో శనివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రం గూడలోనున్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ (బాయ్స్-1) లో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ పి.సరస్వతి తదితరులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్ళలో నాణ్యమైన భోజనం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. పేద విద్యార్థుల సిఎం చూపుతున్న చొరవకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ శేఖర్, కమీషనర్ సరస్వతి

కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఆర్ఐ మహిపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బాలరాజ్, నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, సుభాన్ యాదవ్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంపై దుష్ప్రచారం చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్ డిసెంబరు 14 ప్రభాతవార్త : సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లపై తప్పుడు ప్రచారం చేసిన నవ సంఘర్షణ సమితి ఆల్ ఇండియా చైర్మన్ పంజాల జైహింద్‌గౌడ్ తదితరులు దుష్ప్రచారం చేసిన వ్యక్తులకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి ఎసిపి చక్రపాణికి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఉప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్, రామంతాపూర్ యూత్ అధ్యక్షుడు అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సచిన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతలపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు రంగుల శేఖర్, చింటూ, బిన్నీ, యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో సీనియర్ సిటియన్స్ పాత్ర కీలకం:రామ్‌రెడ్డి

హైదరాబాద్ డిసెంబర్ 14 ప్రభాతవార్త: సమాజం అభివృద్ధిలో సీనియర్ సిటిజన్ పాత్ర కీలకమైనదని, వారు వయసులో వివిధ రంగాల్లో అభివృద్ధికి కృషి చేశారని రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్‌లో శనివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రామ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు ఎకరా భూమి ఉన్నదని దానిలో భవనం నిర్మాణానికి రూ. 15 లక్షలు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజెన్స్ కూడా బస్సులో కన్సిషన్ ఇస్తామని తెలిపారు. కాలనీలోని కొన్ని సమస్యలు పరిష్కరించాలని రామ్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు.

బడంగ్‌పేట్‌లో ముగిసిన సిఎం కప్ క్రీడా పోటీలు

విజేతలకు సిఎం కప్‌లను అందజేస్తున్న మేయర్, కమీషనర్

హైదరాబాద్ డిసెంబరు 14 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సిరిపురం యాదయ్య మున్సిపల్ గ్రౌండ్స్‌లో సిఎం కప్ క్రీడా పోటీలు ఘనంగా ముగిసాయి. శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కమీషనర్ సరస్వతిలు క్రీడా పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సిఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరచి గెలుపొందిన విద్యార్థులకు వారు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ క్రీడలతో విద్యార్థులు శారీరకంగా,మానసికంగా దృఢంగా తయారవుతారని అన్నారు. ఇలాంటి క్రీడల ద్వారా వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడమే కాకుండా వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ వంకాయల యాదగిరి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, సుభాన్ యాదవ్, రవికాంత్‌రెడ్డి, క్యారగారి శ్రీధర్, కుమార్, వెంకటేశ్, నర్సింగ్, శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ

ఫని కుమార్ గురుస్వామి కి మంత్ర దండం అందజేస్తున్న రామచంద్రన్ నాయర్ గురుస్వామి

హుడా కాంప్లెక్ , డిసెంబరు 14, ప్రభాతవార్త: బ్రహ్మశ్రీ రామచంద్రన్ నాయర్ గురు స్వామి దివ్య కరకమలములచే శ్రీ ఫనికుమార్ గురుస్వామి (18వ మాలా ధారణ) 18 కలశాల మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. న్యూ మారుతి నగర్ కమ్యూనిటీ హాల్ లో ఫనికుమార్ కుటుంబ సమేతంగా కుమారుడు సర్వేను కౌశిక్ (కన్నేస్వామి) తో కలిసి ఈ మహా పడిపూజలు నిర్వహించారు. ఈ మహాపడి పూజా మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి అయ్యప్ప మాల ధార భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ప్రజ లందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుతూ జరిపిన ఈపూజలలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందడం జరిగింది. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

ఉచిత ఆరోగ్య శిబిరం ప్రారంభం

హుడా కాంప్లెక్ , డిసెంబరు 14, ప్రభాతవార్త: గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో మధురపురి కాలనీ, దిల్ సుఖ్ నగర్‌లోని విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం, అపోలో హాస్పిటల్‌తో కలిసి నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిర కార్యక్రమాన్ని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని , వారి ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని సమాజాన్ని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవా చారి, గడ్డిఅన్నారం డివిజన్ మాజీ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు అనంత చారీ, ప్రధాన కార్యదర్శి లవ కుమార్, సంఘం సభ్యులు వెంకటరమణ, రామదాసు వెంకట చారి, రవి, శ్రీనివాస్ చారీ మరియు బీజేపీ డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్, లోకేష్, రఘునందన్ జోషి, టీంకు, హరీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా మొగుళ్ళపల్లి

హైదరాబాద్ డిసెంబర్ 14 ప్రభాతవార్త: భారత ప్రభుత్వం సెంట్రల్ సెన్సర్ బోర్డు సబ్యునిగా డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్ గుప్తా నియామకమయ్యారు. ఈ మేరకు సెన్సార్ బోర్డు హైదరాబాద్ రీజనల్ సఫిల్ కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. రెండవ సారి నియామకం అయిన మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా రెండు సంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ బిజెపి అధ్యక్షుడు నడ్డ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, కేంద్ర నాయకులు డాక్టర్ కె. లక్ష్మణ్, గారికపాటి మోహన్ రావు, లంకల దీపక్ రెడ్డి సలహాలు సూచనలతో ముందుకు వెళ్తామన్నారు.

దత్తాత్రేయ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

సురేఖ భాస్కర్‌రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న పురోహితుడు

హైదరాబాద్ డిసెంబర్ 14 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ అల్కాపూరి కాలనీలోని శ్రీశ్రీశ్రీ శృంగేరీ జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం శ్రీశారదా పీఠం శృంగేరీ శంకర మఠంలోని గురు దత్తాత్రేయ జయంతి సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ దేప సురేఖభాస్కర్‌రెడ్డి, టీపీసీసీ సబ్యుడు భాస్కర్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు వారికి ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మాధికారి కెవి. శ్రీనివాస్‌శర్మ, కెఎన్.మూర్తి, గౌరీభాస్కర్, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందజేయాలి:చింతల

విద్యార్థులకు భోజనం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్

హైదరాబాద్ డిసెంబర్ 14 ప్రభాతవార్త: విద్యార్థులకు పౌష్టిగా విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ ప్రబుత్వ ఎస్సి బాయ్స్ హాస్టల్‌లో న్యూ కామన్ డైట్ మెనూను శనివారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని హాస్టల్లో ఒకే తీరుగా భోజనం అమలు చేయాలని, మెనూలో చూపిన విధంగా ప్రతిరోజూ భోజనాన్ని అందించాలని సూచించారు. ఆహార కల్తీ జరిగినప్పుడు తనిఖీ చేసి కారణాలను తెలుసుకొని, బాధ్యులను గుర్తించేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రబుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆహార భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలని, ఫుడ్ పాయిజన్ కాకుండా చూడాలని, మంచి క్వాలిటీ ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు రావుల శ్రీనివాస్‌గౌడ్, రాముయాదవ్, విద్యార్థులు తదితరులు